


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

**ఆమె అలా చెబుతుంటే** నాకు సిగ్గేసింది. తెలివైన వాణ్ణి కావచ్చునేమో, కానీ భాష నేర్చుకోవడంలో నా తెలివికి చెప్పుకోతగ్గ నిదర్శనాలు లేవు. అప్పటికి భువనేశ్వర్లో ఐదేళ్లకు పైగా ఉన్నాను కానీ ఒరియా నేర్చుకోలేదు. ఆఫీసులో ఇంగ్లీషు, బయట వచ్చీరాని హిందీతో మానేజ్ చేస్తున్నాను. ఇక్కడ జర్మనీలో జర్మన్ మాట్లాడ్డం తప్పనిసరై ఏదో మాట్లాడుతున్నాను. కానీ నాతో వచ్చిన ఇండియన్సులో చాలామంది నాకంటే బాగా మాట్లాడుతారు. అర్హత లేని పొగడ్త కాబట్టి నాకామె మెప్పు సంతోషాన్నివ్వలేదు.

హైస్కూలు, కాలేజి రోజుల్లోనే క్లాస్‌మేట్సయినా ఆడపిల్లలకి దూరంగా ఉండేవాణ్ణి. ఇక్కడైతే భాష కూడా అంతంతమాత్రం కాబట్టి నాకు బ్రిగెట్టీతో మాట్లాడే ఆసక్తి కలగలేదు. ఆపైన ఉదయం లేచీలేవగానే ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లే హడావుడి. తిరిగొచ్చేసరికి రాత్రి ఏడో, ఎనిమిదో! నిజం చెప్పాలంటే ఆమె నా ఎదుటి గదిలో ఉంటున్నదనే మర్చిపోయాను. అలా రెండు రోజులు గడిచిపోయాయి.

యాకేల్ నా గురించి చెప్పిన మాటలు బ్రిగెట్టీకి నేనంటే కుతూహలం కలిగించినట్లున్నాయి. నేను తనని పలకరిస్తానని మూడు రోజులు చూసింది. ఆదివారం రాగానే ఇక ఆగలేక, నా గదికి వచ్చింది. “కాసేపు కబుర్లు చెప్పుకుందాం. నీ గది చాలా చిన్నది కాబట్టి, నా గదిలోకొస్తావా?” అనడిగింది స్నేహపూర్వకంగా.

వెళ్లాను. చూస్తే ఆ గది చాలా పెద్దది. పెద్ద మంచంతో పాటు సోఫా, కుర్చీలు కూడా ఉన్నాయి. ఇద్దరం ఎదురెదురుగా కూర్చున్నాక, “నీ గురించి చెప్పు” అంది జర్మన్లో.

నాకొచ్చిన జర్మన్ అంతంతమాత్రం. బయట ఎవరితో మాట్లాడినా, జర్మన్లోనే మాట్లాడమని మా టీచర్ చెప్పింది. బయటివాళ్లు కూడా గ్యోతే ఇన్‌స్టిట్యూట్ విద్యార్థుల్ని జర్మన్లోనే మాట్లాడమని ప్రోత్సహిస్తారు.

నాకొచ్చిన చచ్చు భాషలో నెమ్మదిగా కబుర్లు మొదలు పెట్టాను. ఏం చెప్పాలో తెలియక, నేనొక రచయితననీ, నా శ్రీమతి నా రచనలు ఫెయిర్ చేస్తుందనీ చెప్పాను. మామూలుగా ఐతే అంత తక్కువ పరిచయంలో నేను రచయితనని ఇతరులకి చెప్పిన సందర్భాలు లేవు.

ఆమె నావంక అడ్మయిరింగ్‌గా చూసింది.

మొహమాటమేసి, ఎందుకు చెప్పానా అనుకున్నాను. అంతలో యాకేల్ వచ్చింది. మా ఇద్దరికీ కేక్ పెట్టింది.

ఫస్ చెయ్యడం ఇష్టం లేక మాట్లాడకుండా తిన్నాను. మానసిక బలమేమో, ఆ పూట కేక్ బాగుందనిపించింది.

కేక్ తింటూనే బ్రిగెట్టీ తనగురించి చెప్పింది.

ఆమె వయసు ఇరవై సంవత్సరాలుట. మాటల సందర్భంలో, తనకి బ్రౌన్ కలరంటే ఇష్టమంది.

"బ్రౌన్అంటే ?" అన్నాను అర్థం కాక.

"అదే, నీ వంటి రంగు!" అందామె మామూలుగా.

అబద్ధమెందుకూ, నాలో సంతోషం పొంగుకొచ్చింది. ఎందుకంటే, ఒకరోజు నేనూ, నటరాజన్ బస్సులో వెడుతుంటే మా వెనుక సీట్లో ఓ తెల్ల యువతీ, నాలుగైదేళ్ల కొడుకూ కూర్చుని ఉన్నారు. ఆ పిల్లాడు చూడ్డానికి బొద్దుగా ముద్దుగా ఉన్నాడు. వెనక్కి తిరిగి మరీ ఆ కుర్రాడివంక చూసి ముద్దుగా నవ్వాం. తల్లిమనసు ఉప్పొంగినట్లుంది, ఆ యువతి వెంటనే కుర్రాడితో, "వాళ్లెవరో తెలుసా?" అంది ముచ్చటగా. మా గురించీ, ఇండియా గురించీ నాలుగు మంచి మాటలు చెప్పాలని ఆమె ఉద్దేశ్యమై ఉండొచ్చు. ఆ కుర్రాడు వెంటనే, "ఆఫ్రికానర్" (ఆఫ్రికన్లు) అన్నాడు. ఆ తర్వాత ఆమె కొడుకుని మందలించిన స్వరాన్ని బట్టి తను నొచ్చుకుందని అర్థమైంది. మేము ఇండియన్సుమనీ, ఇండియా చాలా గొప్పదేశమనీ కాస్త ఎక్కువ చేసి చెప్పి కవర్ చెయ్యడానికి ప్రయత్నించింది. మేమిక వెనక్కి తిరగలేదు.

నటరాజన్ కొంచెం చిన్నబుచ్చుకున్నాడు. "మనం మరీ అంత నల్లగా ఉన్నామా?" అన్నాడు నాతో.

"మనమెలా ఉన్నామన్నది కాదు ముఖ్యం. మనం వాళ్ల కెలా కనబడతామన్నది ముఖ్యం. ఆ మాటన్నది మాయామర్మం తెలియని ఓ పసివాడు. మనం ఇతరుల నలుపుని చిన్నబుచ్చేముందు, మనమూ కొందరికి నలుపని హెచ్చరించడానికే ఈ ఘటన" అన్నాను హుందాతనాన్ని నటిస్తూ. కానీ మనసులో నేనూ అతడిలాగే మథన పడుతున్నాను. ఇంతకాలం తెలుపని కాకపోయినా, కనీసం బ్రౌన్గా ఉంటానన్న నమ్మకంలో ఉన్నాను. ఆ నమ్మకాన్ని వమ్ము చేశాడా జర్మన్ పసిబాలుడు.

కానీ ఇప్పుడు నిండు యౌవనంలో ఉన్న ఓ తెల్లమ్మాయి, నా రంగు బ్రౌన్ అని నిర్ధారించడమే కాక అది తనకిష్టమని కూడా చెప్పింది. మొహమాటాన్ని అణచుకుంటూ, "డాంకే (థాంక్స్)" అన్నాను.

"నేనే కాదు. మా జర్మన్స్ అంతా బ్రౌన్ రంగు ఇష్టపడతాం. బహుశా మీ ఇండియన్స్ మా రంగు ఇష్టపడతారనుకుంటాను" అని నేనేమంటానోనని కుతూహలంగా నావంక చూసింది.

నిజం చెప్పేయాలనిపించింది. "మాకైతే యూరోపియన్స్ వంటి రంగు పాలిపోయినట్లుంటుంది. అది మాకు నచ్చదు. మాకూ వంటి రంగు బ్రౌన్గా ఉంటేనే ఇష్టం. అయితే మరీ పాలిపోయినట్లు ఉండకపోతే, మీ రంగు బ్రౌన్ కంటే బాగుంటుంది – నీ వంటి రంగులా" అన్నాను కొంచెం లౌక్యంగా. ఆమె వంటి రంగు బాగుందన్న మాట మాత్రం నిజం.

అప్పుడామె ఎంత సిగ్గు పడిందంటే, ప్రపంచంలో ఎక్కడి ఆడవాళ్లయినా ఒక్కలాగే సిగ్గు పడతారనిపించింది. ఆడవాళ్ల సిగ్గు ఎక్కడైనా మనోహరంగా ఉంటుందని కూడా అనిపించింది.

క్రమంగా కబుర్లలో పడి ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. ఇండియాలో గృహిణులకి వంట పని ఎక్కువనీ, రోజులో చాలా భాగం వంటింట్లోనే గడుపుతారనీ, వంట కూడా కష్టమేననీ చెబితే ఆమె ముందు ఆశ్చర్యపోయింది. తర్వాత బాధగా నిట్టూర్చింది.

కట్టూబొట్టూ ప్రసక్తి వచ్చి, "ఇండియన్ మహిళలు బరువైన చీరలు కట్టుకుంటారు కదా, కట్టడం కూడా కష్టం అనిపిస్తుంది. మా బట్టలైతే తేలిగ్గా ఉంటాయి. వేసుకోవడం కూడా సులభం!" అందామె.

నేనొప్పుకోలేదు. "అలవాటైతే ఏదీ కష్టమనిపించదు. నీ పెర్సనాలిటీకి నువ్వు గౌన్లో కన్నా చీరలో ఎక్కువ బాగుంటావు" అన్నాను.

మళ్లీ అచ్చమైన ఆడపిల్లలా సిగ్గు పడిందామె.

బ్రిగెట్టీకి సిగరెట్‌అలవాటుంది. ముందు నాకు ఆఫర్ చేసింది. నాకు అలవాటు లేదన్నాను. అప్పుడామె నా అనుమతి తీసుకుని ఓ సిగరెట్ వెలిగించుకుంది. పొగ పీల్చి గుప్పున వదులుతూ, "పొగ తాగడం మంచిది కాదు. నేనూ మానేయ గలిగితే బాగుణ్ణు" అంది కొంచెం స్వగతంలా.

ఇరవైఏళ్ల అందమైన అమ్మాయి నోట్లో సిగరెట్! నేను పెరిగిన వాతావరణానికి ఆ రెండూ మ్యాచైనట్లు అనిపించలేదు.

తర్వాత ఆమె నా కుటుంబ వివరాలు అడిగింది. మా నాన్నగారికి పదిమంది సంతానమనగానే షాక్ తినేసింది. "అంతమంది పిల్లలుండడంపై నీ అభిప్రాయమేమిటి?" అంది. అదామె మర్యాద. నా అభిప్రాయం తెలిసేదాకా ఆ విషయమై తన స్పందనని చెప్పదు.

"ఇప్పుడు ఇండియాలో చాలామంది ఫామిలీ ప్లానింగ్ పాటిస్తున్నారు. ఇద్దరు లేక ముగ్గురు చాలు అన్నది మా దేశంలో కొత్త నినాదం. ఈ మార్పుని నాలాంటివాళ్లంతా స్వాగతిస్తున్నారు" అన్నాను.

ఆమె కళ్లు మెరిశాయి. "నీకు అంతమంది తోడబుట్టినవాళ్లున్నారని బాధగా అనిపిస్తుందా?" అంది.

"అంతమంది పిల్లలుండడంవల్ల ఆర్థికంగా చాలా ఇబ్బంది పడాలి. అందుకని బాధపడాలి. బాధపడితే, తోడబుట్టినవాళ్లని అవాంఛనీయులుగా భావించినట్లే కదా! కాబట్టి భవిష్యత్తులో అలా జరగనివ్వకూడదని అనుకుంటాను తప్ప, ఇప్పటికే జరిగిందానికి బాధపడను. ఆ విషయమలాగుంచితే – పండుగలకీ, వేడుకలకీ అందరం కలుసుకున్నపుడు – మాకు అంత బలగం ఉన్నందుకు మహదానందంగా ఉంటుంది" అన్నాను.

సరిగ్గా రాని భాషలో మాట్లాడడంవల్ల నా మెదడుకి శ్రమగానే ఉంది. ఐనా మేమిద్దరం అక్కడ కూర్చుని సుమారు అయిదు గంటలు మాట్లాడుకున్నాం.

మధ్యలో ఫ్రౌ యాకేళ్ ఊరించి చెబుతూ, "జీ ఈస్ట్ జేర్ ష్యోన్" అన్నాను. ఆ మాట యాకేల్‌తో కూడా చాలాసార్లు అన్నాను. అన్నప్పుడల్లా ఆమె సిగ్గుపడేది. నా అభిప్రాయంలో ఆ పదానికి అర్థం ఆమె చాలా మంచిదని. మరి ఆ మాటకు ఆమె సిగ్గు పడాల్సిన కారణం నాకు అప్పుడు తెలియలేదు. ఇప్పుడు బ్రిగెట్టీ చెప్పగా తెలిసింది. ష్యోన్ అనే మాటకి నైస్ అన్న అర్థం ఉన్నప్పటికీ, ఆ పదాన్ని ఎక్కువగా అందాన్ని పొగడ్డానికే వాడతారుట. కాబట్టి ఆ మాట అందరికీ వాడొద్దని చెప్పిందామె.

నేను యాకేల్ గుణగణాల్ని పొగుడుతున్నాననుకుని, అందాన్ని పొగుడుతున్నాను. అందుకా వృద్ధురాలు సిగ్గు పడుతోందని అర్థమై, అయ్యో అనుకున్నాను. మంచితనాన్ని అభినందించడానికి ష్యోన్‌కి బదులు నెట్ అనమని బ్రిగెట్టీ చెప్పింది. ఆ రోజుకి మా సమావేశం అలా ముగిసింది.

టేపురికార్డరు కొన్న రోజున, హడావుడిగా ఇంటికొచ్చి ఆబగా పిల్లల మాటలు వింటుండగా – బ్రిగెట్టీ వచ్చి తలుపు తట్టి పలకరించింది. పిల్లల మాటలు ఒకసారి తను కూడా విని వాళ్ల వయసులడిగి తెలుసుకుని, "మీ ఇండియన్సువి ఈడుకి మించిన తెలివితేటలు" అంది.

ఆ మాట హృదయంలోంచీ కాక, మాటవరసకి మర్యాదగా అన్నట్లు నాకు అనిపించింది.

వచ్చీ రాని నా జర్మన్ భాష ఆమెకు ఏమి వినోదాన్నిస్తోందో తెలియదు కానీ మర్నాడు మళ్లీ తన గదికి ఆహ్వానించింది. వెళ్లాను.

ఈసారి మాటల్లో తనే మాంసాహారం ప్రసక్తి తెచ్చి, "నువ్వు మాంసం తిననంటావు. తింటే తప్పేంటి?" అనడిగింది.

"మాంసాహారమైనా, శాకాహారమైనా ఎంతో కొంత హింస లేకుండా లభించదు. తరతమ భేదాలుంటాయంతే! ఉదాహరణకు – మనం జంతువుల్ని ఆహారంగా భావించి చంపి తింటున్నాం. మనకంటే బలమైన, తెలివైన రాక్షసజాతి ఒకటి ఉండి – రోజూ మనని వేటాడి తింటుంటే అప్పుడు మన మనఃస్థితి ఎలా ఉంటుంది? అలాంటి మనఃస్థితినే నేను జంతుజాలం విషయంలో ఊహించుకోవడంవల్ల –

మాంసాహారం తినలేక పోతున్నాను. వృక్షాలక్కూడా ప్రాణం ఉన్నప్పటికీ, అవి ప్రాణమున్న జీవాలని నా ఊహకు అనిపించకపోవడంవల్ల, శాకాహారం తినగల్గుతున్నాను" అని చెప్పానామెకి.

మనుషులకంటే బలమైన, తెలివైన జాతి మనుషుల్ని తినడం ఆమె ఊహలోకి వచ్చినట్లుంది – బ్రిగెట్టీ కళ్లలో కొంచెం భయం కనబడింది. టాపిక్ మార్చి, "చీర కట్టుకోవాలనుంది. నువ్వు నేర్పగలవా?" అంది.

ముందు రాదన్నాను కానీ ఆమె ఒప్పుకోలేదు. నాకు చీర కట్టడం తెలిసే ఉండడానికి రకరకాల లాజిక్కులు తీసింది. "మీ దేశంలో ఆడవాళ్లందరూ చీర కట్టుకుంటున్నప్పుడు, మీ మగాళ్లకి కూడా ఎంతో కొంత తెలిసుండాలి. ఊహించైనా ప్రయత్నించు" అందామె.

"కానీ, ఇక్కడ చీరలు లేవే!" అన్నాను.

"చీరంటే ఉత్త గుడ్డే కదా! ఈ దుప్పటి పనికిరాదా?" అంటూ అక్కడ మంచంమీదున్న పెద్ద దుప్పటీని తీసింది. ఆ వెంటనే, "అమ్మో! ఇది ఏకంగా ఆరు మీటర్ల పైన ఉంది. దీన్ని కట్ చెయ్యడానికి ఫ్రౌ యాకేల్ ఒప్పుకుంటుందనుకోను" అని నిట్టూర్చింది.

నేను మాట్లాడలేదు. అంతలోనే ఆమె, "ఇంతకీ, చీరకి ఎంత గుడ్డ కావాలి?" అంది.

చెప్పక తప్పలేదు – ఆరేడు గజాలని.

ఆరేడు గజాలనగానే, ముందు అమ్మో అనుకున్నా, ఆ వెంటనే, "ఐతే ఇంకేం, ఈ దుప్పటినే నాకు చీరగా కట్టు" అందామె.

"కట్టడానికేం లేదు. చుట్టబెట్టుకోవడమే" అన్నాను.

"చుట్టబెట్టుకుంటాను కానీ, నువ్వెళ్లి నీ భార్య ఫొటో తీసుకునిరా" అంది ఇంచుమించి ఆజ్ఞాపిస్తున్నట్లు. ఆడవాళ్లు అంతే! తండ్రుల్నీ, అన్నల్నీ, భర్తల్నీ ఆజ్ఞాపించినట్లే – కాస్త పరిచయమైతే చాలు – స్నేహితుల్నీ ఆజ్ఞాపించగలరు.

నేను ఫొటో తీసుకొచ్చేసరికి – బ్రిగెట్టీ వంటికి దుప్పటిని చుట్టబెట్టుకుని ఉంది. ఆ దుప్పటినే కనుక చీర అనుకుంటే – చీరకట్టు ఇంత అసహ్యంగా ఉంటుందా అనిపించింది.

"ఎలా ఉంది?" అందామె. బాగుందన్నాను.

ఆమె తృప్తిపడలేదు. నేను తెచ్చిన ఫొటో అడిగి తీసుకుని చూస్తూ తల అడ్డంగా ఊపింది. నావంక గంభీరంగా చూస్తూ, "ఈ లుక్ రావాలి" అంటూ దుప్పటి విప్పి నాకు అందించింది.

దుప్పటి ఆమెకు చుట్టబెట్టి కుచ్చిళ్లు పెట్టాను. చాలా కుతూహలంగా గమనిస్తోందామె. కట్టడం అవగానే, "ఇంకా ఆ లుక్ రాలేదు" అంది.

"ఆ లుక్ రావాలంటే, పైన జాకెట్ ఉండాలి. పొట్ట భాగం కొంత కనబడాలి" అన్నాను.

నా నోటి మాట పూర్తవలేదు. ఆమె తన వంటిమీదున్న ఓవర్‌కోటు చటుక్కున విప్పేసింది. అప్పుడామె ఛాతీపైన బ్రా తప్పమరో ఆచ్ఛాదన లేదు.

బికినీతో ఆరుబయట మగాళ్లమధ్య తిరిగే సంప్రదాయంలో పుట్టి పెరిగిందామె. అందువల్లనేమో, ఆమెలో ఏ తడబాటూ లేదు.

నేను మాత్రం ఒక్క క్షణం తడబడ్డాను. అది స్పష్టంగా నా కళ్లలో కనబడిందేమో, ఆమె, "అయామ్ సారీ" అని ఓసారి నిట్టూర్చి మళ్లీ కోట్ వేసేసుకుంది.

ఆమె సారీ చెప్పడానికి కారణమైన నా ముఖభావాలు స్ఫురించడంవల్లనేమో నేను సిగ్గుపడి క్షణంపాటు తల దించుకున్నాను. సారీ చెప్పాలనిపించింది కానీ, చెప్పడంవల్ల అప్రయత్నంగా నా ముఖంలో వచ్చిన మార్పులని మనసుకి కూడా అంటగట్టడం సిగ్గుచేటు కదా, ఆమె సారీని స్వీకరించడమే ఆమెకూ నాకూ మర్యాద అనిపించి ఊరుకున్నాను.

ఇక మౌనం బాగుండదని చటుక్కున తలెత్తి ఆమెని చూశాను. నేనిన్ని ఆలోచనలకి గురయ్యాను కానీ, ఆమె చాలా మామూలుగా ఉంది. కళ్లు నిర్మలంగా ఉన్నాయి.

“నాకు చీర కట్టుకోవాలనుంది. ఇండియానుంచి నాకో చీర తెప్పించిపెట్టగలవా?” అందామె నవ్వుతూ.

నేనూ సర్దుకున్నాను. “మా దేశంలో కంటే బట్ట క్వాలిటీ మీ దేశంలోనే బాగుంటుంది. నైలెక్స్ కానీ, పోలీ ఎస్టర్ కానీ – చీరకు అయిదు మీటర్లూ, జాకెట్టుకి ఒక మీటరూ – మొత్తం ఆరు మీటర్లు తీసుకుంటే సరిపోతుంది” అన్నాను.

అయిదు మీటర్ల గుడ్డను వంటికి చుట్టబెట్టుకుని ధరించి భరించడమా – అని గుండెలు బాదుకుందామె.

తర్వాత మేము పలు విషయాలు మాట్లాడుకున్నాం. ఆమెకి తెలుగు మాటలు తనే చదవాలనుంది. అందుకని నాకు తోచిన మాట ఒకటి ఇంగ్లీషు అక్షరాల్లో వ్రాయమని కోరింది. ఆమె ఉత్సుకతకి ముచ్చటపడి, “నీ కళ్లు బాగుంటాయి” అని రాశాను.

ఆమె కూడబలుక్కుంటూ చదివింది. ఆమె ఉచ్చారణని సరి చేశాను. రెండుమూడు ప్రయత్నాల్లో ఆమె నోట తెలుగు తెలుగులాగే పలికితే మెచ్చుకున్నాను.

ఆమె ముఖంలో సంతోషం. “ఇంతకీ నువ్వేం రాశావ్? ఆ మాటకి అర్థమేమిటి?” అనడిగింది. చెప్పాను.

అప్పుడామె సంతోషం పట్టలేక తన కుడిచేతిని ఒకసారి పైకెత్తి విసిరినట్లుగా అరచేతిని కిందికి దింపింది. “నువ్వు మరీనూ? పోదూ” అనడానికి అక్కడివాళ్ల తనుభాష అది.

ఆ సంతోషం కలిగించిన నవ్వు ముఖంతోనే, తన దగ్గరున్న ఓ ఆల్బంలోంచి కొందరు అమ్మాయిల బొమ్మలు చూపించి, “నీకు నచ్చారా?” అనడిగింది.

ఇరవైకి అటూ ఇటూలో ఉన్నవారు. ఆడపిల్లలు. తెల్లపిల్లలు. ఆరోగ్యంతో మిసమిసలాడే వారిలో అందానికి తక్కువేముంటుంది?

“చాలా బాగున్నారు” అన్నాను. అక్కడికి అదేదో అందాల పోటీలో న్యాయనిర్ణేత తీర్పు విన్నట్లు ఆమె ముఖం వెలిగిపోయింది. అంతకుముందు నా మాటలు విని, నాకు ఇండియా అమ్మాయిలు తప్ప ఇంకెవరూ నచ్చరని ఆమె అనుకుని ఉండాలి.

తర్వాత ఆమె నాకు డ్యాన్స్ వచ్చా అనడిగింది. రాదని చెబితే ఆశ్చర్యపడింది. ఆమె ఆశ్చర్యానికి నేనూ ఆశ్చర్యపడి, “ఇష్టమైనవాళ్లు డ్యాన్స్ నేర్చుకుంటారు. లేనివాళ్లు లేదు. ఇందులో ఆశ్చర్యమేముంది?” అన్నాను.

“కానీ జర్మనీలో ప్రతి ఒక్కరికీ డ్యాన్సొస్తుంది” అందామె.

“మీ డ్యాన్సెలా ఉంటుంది?” అన్నాను కుతూహలంగా.

ఆమె వెంటనే ఉత్సాహంగా కొన్ని స్టెప్స్ వేసి చూపించింది.

ఆ స్టెప్స్ నాకు కొత్త కాదు. మన సినిమాల్లో, ముఖ్యంగా హిందీ సినిమాల్లో, హీరో హీరోయిన్స్ పార్టీల్లో వేసేవే అవి.

“డ్యాన్సంటే ఇదనుకోలేదు. సరదా ఉంటే ఇది నేర్చుకోవడం కష్టం కాదు. డ్యాన్సంటే నేను భరతనాట్యం అనుకున్నాను” అన్నాను.

“భరతనాట్యమంటే?” అందామె. నోటి మాటల్లో చెప్పడానికి ప్రయత్నించాను కానీ, ఆమె కొన్ని స్టెప్స్ వేసి చూపించమంది.

నేనడగ్గానే తను స్టెప్స్ వేసి చూపించింది. వచ్చినా రాకపోయినా, ఆమెకు కొంత ఐడియా ఇవ్వడం నా బాధ్యత.

నా జీవితంలో ఒక అపరిచిత యువతి ముందు నిలబడి భరత నాట్యభంగిమలు చూపిస్తానని కలలో కూడా అనుకోలేదు. అందులోనూ నాకు బొత్తిగా డ్యాన్స్ రాదు.

ప్రేక్షకుడిగా నేను చూసిన భంగిమల్లో అప్పటికి స్ఫురణకి వచ్చినవి కొన్ని చూపడానికి ప్రయత్నించానంతే!

శ్రీమతి చూస్తే ఈ నా ప్రయాస ఆమెకు గొప్ప వినోదంగా ఉండేది. బ్రిగెట్టీ ఆ భంగిమలను ఆశ్చర్యంగా గమనించి, "అలా డ్యాన్స్ చెయ్యడం ఎందుకు?" అనడిగింది.

అప్పటికి నాకు అర్థమైంది – ఆమెకీ నాకూ సంస్కృతిపరంగా ఉన్న భేదం.

నిత్యజీవితంలో యువతీయువకులు కలిసి నృత్యం చెయ్యడం భారత సంస్కృతి కాదనీ, అక్కడ నృత్యమన్నది కేవలం వినోద ప్రదర్శన మాత్రమేననీ, కొందరు కళాకారులు నృత్యకళకు తమ జీవితాల్ని అంకితం చేస్తారనీ చెప్పాను. అక్కడ కూడా నృత్య కళకారులు ఉన్నారు కాబట్టి ఆమెకు విషయం అర్థమైనట్లుంది.

ఆ మర్నాడు బ్రిగెట్టీ వెళ్లిపోయింది. వెళ్లేముందామె తనకి పెళ్లి నిశ్చయమైందని చెప్పి ఎంజేజిమెంట్ రింగు కూడా చూపించింది. నాదగ్గర వీడ్కోలు తీసుకుంటూ – తనకో చీర తెప్పించిపెట్టమని మరీ మరీ చెప్పింది. నేనామె విన్నపాన్ని యథాలాపంగా తీసుకున్నాను. కానీ ఆమె గురించి ఇతరంగా చాలా అలోచించాను.

భారత దేశంలో భార్యతో తప్ప మరే యువతితోనూ బ్రిగెట్టీతో అంత సన్నిహితంగా మసలలేదు నేను. నా ఈడు ఆడపిల్లలు కాస్త దగ్గరగా వచ్చి మాట్లాడితేనే ఏదోలా ఉండేది నాకక్కడ. అటువంటిది ఇక్కడ ఈమెతో గంటల తరబడి ఏకాంతంగా, సన్నిహితంగా మసిలాను. అయితే నా బుద్ధి పెడదారులు తొక్కలేదు. ఒక స్నేహితుడితో మాట్లాడుతున్నట్లే ఉంది తప్ప ఆమెలోని స్త్రీని నేను గుర్తించలేదు. ఆమె ముఖభావాలు చూస్తుంటే తనూ అలాగే ఫీలయిందనిపించింది. ఈ తేడాకి కారణమేమిటి?

మన సంస్కృతి స్త్రీలపట్ల కాంక్షనే తప్ప స్నేహభావాన్ని కలుగనివ్వదా? యువతీయువకుల మధ్య దూరాన్ని తగ్గించడం ద్వారా వారి మనసులు మరింత స్వచ్ఛంగా ఉండే అవకాశముందన్న విషయం నిజమా?

ఏదిఏమైనా బ్రిగెట్టీతో గడిచిన ఆ కొద్ది రోజులూ నాకు మరపురాని అనుభవం.

## పిక్నిక్ పిక్నిక్ పిక్నిక్

చదువుకుందుకొచ్చినా మేము సందర్శకులం కూడా కదా! మేమక్కడ విహారయాత్రలూ చేశాం. కొన్ని పిక్నిక్స్ సంస్థ ఏర్పాటు చేస్తే, కొన్ని మాకు మేముగా వేసుకున్నవి.

ల్యూనబర్గ్ వచ్చిన ఇరవై రోజులకి, అంటే జూన్ 25న – గ్యోతే ఇన్స్టిట్యూట్ వారు – విద్యార్థులకోసం ఒక ఔస్‌ఫ్లూగ్(పిక్నిక్) ఏర్పాటు చేశారు. అందులో ఆయా విద్యార్థుల హౌస్‌ఫ్రౌలు (ల్యాండ్‌లేడీలు) కూడా పాల్గొనవలసి ఉంది. తనకి వీలు కుదరలేదని చెప్పి ఫ్రౌ యాకేల్ ఈ పిక్నిక్కి రాలేదు.

ఔస్‌ఫ్లూగ్‌కని మేమెక్కిన టూరిస్ట్ బస్సు అద్భుతంగా ఉంది. లోపలి సీట్ల అమరిక విమానంలో లాగా ఉంది. గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో పోతున్నా బస్సులో కదుపు గానీ, కుదుపు గానీ లేదు.

మా గమ్యం ఎల్బే నదీతీరం. మధ్యలో ఒక హోటల్ వద్ద ఆగేం. అక్కడ అందరికీ కేక్కు, ఐస్క్రీమ్ సెర్వ్ చేశారు. అవి తిని మళ్లీ బస్సెక్కి ఎల్బే నదీతీరంకి చేరుకున్నాం. అక్కడ మాకోసం ఒక స్టీమ్‌బోట్ సిద్ధంగా ఉంది. అందులో అంతా ఎక్కాం.

ప్రశాంతంగా వీచే చల్లని గాలి, చలి పుట్టిస్తోంది కానీ, ఆ చలిని ఆపడానికి వేసుకున్న స్వెటర్ సరిపోయింది.

ఎల్బే నది వెడల్పు తక్కువే. కానీ అది చాలా యూరప్ దేశాల్లోంచీ ప్రవహిస్తుందిట. నదికి ఈవలి ఒడ్డు పశ్చిమ జర్మనీ. ఆవలి ఒడ్డు తూర్పు జర్మనీ.

నదీవిహారం రెండు గంటల సేపు కొనసాగింది. బోటుమీద ఎంతోమంది ఆడ, మగ జంటలుగా విడిపోయి ఫొటోలు తీయించుకున్నారు. కొందరు బోటులో ఏర్పాటు చేసిన సంగీతానికి అనువుగా నర్తించారు. కొందరు హౌస్‌ఫ్రౌలు తామూ నాట్యం చేశారు.

లావుగా ఉన్న ఒక హౌస్‌ఫ్రా చేసిన నృత్యం అందరికీ ఎక్కువ వినోదాన్నిచ్చింది. పెద్దా, చిన్నా అంతా కలిసిపోయి పసిపాపల్లా ప్రవర్తించడం హాయిగా అనిపించి, కాసేపు ఈ లోకాన్ని మర్చిపోగలిగాం. కానీ – పక్కన శ్రీమతి లేకపోవడం వెలితిగా అనిపించింది నాకు.

ల్యూనబర్గ్‌లో అంకుల్ విల్లీ అనే సమాజసేవకుడున్నాడు. ఆ ఊరొచ్చిన విదేశీయులకోసం ఆయన అప్పుడప్పుడు పిక్నిక్కు ఏర్పాటు చేస్తుంటాడు. ఆయన నిర్వహణలోనే జూన్ 28న మేము హనోఫర్ (హానోవర్) వెళ్ళొచ్చాం. హనోఫర్ పశ్చిమ జర్మనీలో నీడర్‌శాక్సెన్ రాష్ట్రానికి రాజధాని. పరిమాణంలో పెద్ద నగరమే కానీ జనాభా మాత్రం ఐదు లక్షలు. అక్కడ తరచుగా ఇంటర్నేషనల్ ట్రేడ్‌ఫెయిర్ నిర్వహిస్తారు. దానికోసం శాశ్వతమైన ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ఉంది. ఈ ఫెయిర్ విశ్వవిఖ్యాతం.

ఆహ్లాదకరమైన వాతావరణం, పరిశుభ్రమైన రోడ్లు, ఎత్తైన భవంతులు, ఆకర్షణీయమైన బజార్లు ఉన్న ఆ నగరంలో జనసంచారం అంతంతమాత్రం. నగరానికి ప్రత్యేక ఆకర్షణ పూలతోటలు. వాటి అందం వర్ణనాతీతం.

తిరుగు ప్రయాణంలో ఇన్ఫర్మేషన్ అండ్ టూరిస్ట్ సెంటర్లో ఆగాం. అక్కడ దేశవిదేశాల యువతీ యువకుల కార్యక్రమాలౌతున్నాయి. ఫ్రీగా వైన్ పోస్తున్నారు. కోలా మాత్రం కొనుక్కోవాలి. పాటలు, నృత్యప్రదర్శనలు జరిగాయి. చూడ్డానికి కాలేజి స్థాయిలో ఉన్నాయి. అనేక దేసస్థులతోపాటు మన సర్దార్జీలు కూడా బాగా ఎక్కువ సంఖ్యలో కనిపించారక్కడ.

గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు ఏర్పాటు చేసిన మరో ఔస్‌ఫ్లూగ్‌లో జూలై 4న హ్యాంబుర్గ్ (హ్యాంబర్గ్) నగరానికి వెళ్లాం. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఓడరేవు అక్కడుంది.

ముందు మమ్మల్ని హార్బరుకి తీసుకెళ్లి స్టీంబోటుమీద చాలాసేపు విహారం చేయించారు. ఆ విహారంలో దేశదేశాల ఓడల్నీ, ఓడల్ని మరమ్మతు చేయడానికున్న సదుపాయాల్నీ చూశాం.

అక్కడ మాకు బంగ్లాదేశ్ ఓడ ఒకటి కనిపించింది. దూరదేశంలో ఉండడం వల్లనేమో, స్వదేశపు ఓడే అనిపించింది.

తర్వాత మమ్మల్ని సెయింట్ పౌలీ చర్చికి తీసుకెళ్లారు. అది బాగా పాతకాలపు చర్చి. చర్చి లోపల ఎలా ఉంటుందో చూడ్డం నాకదే మొదటిసారి.

ఆలయం కాబట్టి చర్చి పవిత్రమైనది. సెయింట్ పౌలీ పేరు కూడా పవిత్రంగా ధ్వనిస్తుంది. కానీ హాంబుర్గ్‌లో సెయింట్‌పౌలీ అనగానే పవిత్రభావం కలిగే అవకాశం తక్కువ. ఎందుకంటే అక్కడ సెయింట్‌పౌలీ అంటే స్ఫురించేది చర్చి కాదు. దానినానుకునే ఉన్న రీపర్‌బాన్ స్త్రాసే (వీధి). ఆ వీధిలో మనిషికి తన కామతృష్ణ తీర్చుకునేందుకు ఉన్న వివిధ, విభిన్న మార్గాలు ప్రదర్శితమేకాదు, కావాలంటే అనుసరణకూ అక్కరకొస్తాయి. ఎంత ఆధునికమైనా, స్వేచ్ఛకి అవధులు లేకపోయినా – అలాంటి వీధులు ఏ దేశానికీ గర్వకారణం కాదనే అనుకోవాలి. ఎందుకంటే – చెప్పకతప్పదు కాబట్టి మొక్కుబడికి అన్నట్లు గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు ఆ వీధిని మాకు హడావుడిగా చూపించేసి అయిందనిపించారు. ఐనా ఆ కాసేపటికే ఆ వీధి విశేషాలు మా అవగాహనకొచ్చి మాలో ఉత్సుకత రేపాయి. మరోసారి రాత్రి సమయంలో వచ్చి ఆ వీధి విశేషాలు తెలుసుకోవాలని నేను, నా మిత్రులు అనుకున్నాం.

మధ్యాహ్నం పన్నెండునుంచి సాయంత్రం ఆరు గంటలవరకూ మాకా ఊళ్లో ఆటవిడుపు. కాసేపు రైళ్లలో తిరిగాం. అంతకుముందు శర్మ తనకి హాంబుర్గ్ కొట్టిన పిండి అని చెప్పాడు. కానీ ఈ తిరగడంలో అతనికి హాంబుర్గ్ తెలియకపోవడమే కాదు, యూరప్‌లో బయట తిరిగిన అనుభవం కూడా పెద్దగా లేదని బయటపడింది. వాన పడ్డం వల్ల తిరగడానికి కాస్త ఇబ్బందయింది. తర్వాత నేను, సుబ్రహ్మణ్యం, బిశ్వాస్, దేవదార్ ఒక జట్టుగా విడిపోయాం. కలకత్తా రెస్టారెంటుకి వెడదామన్నాడు బిశ్వాస్. దాని చిరునామా మాకు ల్యూనబర్గ్‌లోనే తెలిసింది. కానీ దారి తెలియక టాక్సీని ఆశ్రయించాం. అందుకైన ఐదు మార్కుల ఖర్చునీ నలుగురం సమంగా పంచుకున్నాం.

కలకత్తా రెస్టారెంటుని ఓ బెంగాలీ ఆసామీ నడుపుతున్నాడు. అతని భార్య జర్మన్ వనిత. అతను మమ్మల్ని చాలా ఆప్యాయంగా ఆదరించి భోజనం పెట్టాడు. అన్నం, ఉడికించిన పెసరపప్పు, పచ్చిమిర్చి ఊరగాయ, అప్పడం, పెరుగు – అదీ భోజనం. "హాయిగా చేత్తో కలుపుకుని తినండి" అని అతను ప్రోత్సహించాడు. బిల్లు ఒకొక్కరికి ఆరు మార్కుల ఎనభై ఫెన్నిగ్గు వేసినా – భోజనం తృప్తిని కలిగించింది. ఎటొచ్చీ పనివాళ్లు లేకుండా హొటలు నడుపుతున్నానని చిన్నతనమో ఏమో, అతను మాకు అడక్కుండానే డిగ్నిటీ ఆఫ్ లేబర్ మీద పెద్ద లెక్చర్ ఇచ్చాడు. అది బోరు కొట్టింది.

అక్కణ్ణించి బయల్దేరి కొన్ని షాపుల్లో విండోషాపింగ్‌తో ఆ యాత్ర ముగిసింది. సెయింట్ పౌలీ కోసం హాంబుర్గ్ మరోసారి చూడాలనుకున్నాం కానీ నిజంగా వెడతామనుకోలేదు.

ఒకరోజు నేను, దేవ్‌దార్, కొరియా, నటరాజన్ ఒకచోట కలిసినప్పుడు, మాటల సందర్భంలో, మా అంతట మేముగా ఓ ఔస్‌ఫ్లూగ్‌కి (పిక్నిక్) వెళ్లాలనుకున్నాం. బాగా ఆలోచించేక హాంబుర్గ్ స్ఫురించింది. ఆగస్ట్ 3న వెడదామనీ, ఈసారి బస్సులో కాకుండా ట్రయిన్లో వెడదామనీ అనుకున్నాం. ఆ రోజు ఎవరిళ్ల దగ్గర వాళ్లు బయల్దేరి రైల్వే స్టేషన్లో కలుసుకున్నాం. ట్రయిన్ 9.29కి బయల్దేరి, 10.35కల్లా మమ్మల్ని హాంబుర్గ్ చేర్చింది. కానీ, ఎందుకో లంకణాలబండిలా అనిపించింది.

సుబ్రహ్మణ్యం జర్మన్ లాంగ్వేజ్ కోర్స్ రెండు నెలలే. అతనిప్పుడు హాంబురగ్‌లో ఉంటున్నాడు. మేము హాంబురగ్‌లో దిగగానే ముందు వెళ్లి అతన్ని కలుసుకున్నాం.

అక్కడ ఏదో థియేటర్లో రాజేష్‌ఖన్నా సినిమా ఉన్నదట. సుబ్రహ్మణ్యం ఆ సినిమాకి వెడదామన్నాడు. ఇండియాలో చూసేవే కాబట్టి, ఇక్కడా హిందీ సినిమాలెందుకని ఆ ప్రపోజల్‌కి మిగతావాళ్లం ఒప్పుకోలేదు.

"ఈ ఊరి మొత్తానికి కేవలం వెజిటేరియన్ రెస్టారెంట్ ఒకటుంది. దానికి వెడదామా?" అన్నాడు సుబ్రహ్మణ్యం.

గతంలో ఒకసారి కలకత్తా రెస్టారెంటుకి వెళ్లి ఉన్నాం. అక్కడ ఇండియన్ ఫుడ్ దొరుకుతుంది కానీ, వెజిటేరియన్‌తో పాటు నాన్‌వెజిటేరియన్ కూడా ఉంటుంది. జర్మన్స్ నడిపే వెజిటేరియన్ రెస్టారెంట్ ఎలా ఉంటుందో చూద్దామనుకుని సరేనన్నాం.

రెస్టారెంట్ మేడమీద ఉంది. లోపల అడుగెట్టగానే ఒకతను, "డియర్ ఫ్రెండ్స్! ఇక్కడ మాంసాహారం ఏమాత్రం దొరకదు. లోపలికొచ్చేముందు ఆ విషయం దృష్టిలో ఉంచుకోండి" అన్నాడు. జంతుసంబంధమని అక్కడ పాలు కూడా సర్వ్ చెయ్యరట.

జర్మనీవంటి ఫక్తు మాంసాహార దేశంలో ఆ మాట వినిపించడం చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది.

మెనూ చూస్తే నాకు తెలిసినవి అన్నం, బంగాళాదుంపల వేపుడు. నటరాజన్‌కి తెలిసిన మరో వెజిటేరియన్ ఐటమ్ కార్టోఫెల్న్ (బంగాళా దుంపల) సలాడ్. అది చాలా బాగుంటుందని అతనంటే అదీ ఆర్డరిచ్చాం.

అబద్ధమెందుకూ – నాకా సలాడ్ నచ్చలేదు. నటరాజన్ నొచ్చుకుంటాడని బాగుందన్నాను. అన్నం, బంగాళాదుంపల వేపుడు ఫరవాలేదు. కానీ నాకు పులుపు, కారం లేకుండా ముద్ద దిగదు. అందువల్ల కొంచెం కష్టపడ్డాను. రెస్టారెంట్‌నుంచి బయటకొచ్చేక ఒక షాపుకెళ్లి పావు లీటరు పాలు, ఓ ఆపిల్ కొన్నాను. వాటితో నా కడుపు నిండింది.

మేము రోడ్లు పట్టుకుని తిరుగుతూ ఒకచోట రోడ్డు క్రాసింగ్దగ్గర ఆగాం. పరిసరాల్ని సునిశిత పరిశీలనలో నటరాజన్ దిట్ట. అతను నాకు ఓ యువజంటని చూపించి, "అటు చూడు. వాళ్లిద్దరూ రోడ్డు క్రాస్ చేస్తూ ముద్దు పెట్టుకోవడం కాయం" అన్నాడు.

అని ఊరుకోలేదు. సిగ్నల్ పడగానే తన కెమేరాతో సిద్ధంగా ఉన్నాడు. ఆ జంట రోడ్ క్రాస్ చేస్తూ నిజంగానే రోడ్డు మధ్యలో ఒకరినొకరు ముద్దుపెట్టుకుని అలాగే ముందుకు సాగిపోయారు. వాళ్ల ముద్దుముచ్చట నటరాజన్ కెమేరాలో రికార్డయింది.

అప్పుడు నటరాజన్‌అన్నాడు, "పదిమందిలో ముద్దు పెట్టుకోవడమే ఒక అడ్వెంచర్ అనుకుంటాం మనం. ఈ ఆరుబయట ముద్దుల్లో వీళ్లకి ఇంకా వేరే అడ్వెంచర్లుంటాయి. ఒకసారి ఓ అమ్మాయీ, ఓ అబ్బాయీ చెరో బైక్‌మీదా వెడుతూ ముద్దు పెట్టుకోవడం చూశాను" అని.

మేము నడుస్తూనే చాలా దూరం తిరిగి టెలివిజన్ టవర్ చేరుకున్నాం. జానపదాల్లో ఒంటి స్తంభం మేడల్ని స్ఫురణకు తెచ్చేలా ఉందా టవర్. ఎత్తైన ఆ టవర్ మధ్యలో ఒక రెస్టారెంటుంది. అది చేరుకుందుకు కిందనుంచి లిఫ్ట్‌ఉంది. అక్కడి రెస్టారెంటులంటే మాలో ఎవ్వరికీ పెద్దగా ఆసక్తి లేదు. మేమా టవర్ని బయట్నించే చూసి ముందుకు సాగిపోయాం.

అక్కడికి దగ్గర్లో మనోహరమైన వన మొకటుంది. మా టూరిస్ట్ గైడ్‌బుక్ ప్రకారం – ఆ వనంలో రాత్రి ఎనిమిది గంటల నలభైఐదు నిముషాలకి రంగుల జలయంత్రాల ప్రదర్శన ఉంటుంది. సరిగ్గా ఆ సమయానికి అక్కడికెళ్లాం.

అక్కడ టైమంటే టైమే మరి. సరిగ్గా ఎనిమిది గంటల నలభై ఐదు నిముషాలకి ఒక్కసారిగా ఓ సరస్సు లోంచి రంగురంగుల ఫౌంటెన్స్ పైకి లేచాయి. ఆ వెంటనే సంగీతం మొదలైంది. జలయంత్రాలు సంగీతానికి అనుగుణంగా నృత్యం మొదలెట్టాయి. ఆ ఫౌంటెన్స్ వింత మనుషుల్లాగానూ, అదో అద్భుత బృందనాట్యంగానూ అనిపించింది. చూస్తున్నప్పటి ఆ అనుభూతి మాటలకందదు.

మా మిత్రుల్లో ఒకరిద్దరు ఇండియాలో మైసూర్లోని బృందావన్ గార్డెన్స్‌లో ఇలాంటిది చూశారుట. కానీ సంగీతానికి అనుగుణంగా భంగిమలు మారుతూ, జలయంత్రాలు నృత్యం చెయ్యడాన్ని ఎక్కడా కనలేదు, వినలేదని వాళ్లన్నారు. మేము స్టిల్ కెమేరాతో ఫొటోలు తీసుకున్నాం కానీ అది మూవీ కెమేరాతో చిత్రించాల్సిన అపూర్వ దృశ్యం. చాలామంది అక్కడకు మూవీ కెమెరాలతో వచ్చారు.

ఆ అద్భుత ప్రదర్శన తొమ్మిదీ పది వరకూ కొనసాగింది. అక్కణ్ణించి లోకల్ ట్రయిన్లో ఎక్కి దగ్గర్లోనే ఉన్న సెయింట్ పౌలీకి వెళ్లాం.

బొంబాయిలో దాదర్లాగ – సెయింట్ పౌలీ లోకల్ రైల్వే స్టేషన్ పేరు. ప్రపంచప్రఖ్యాతి గాంచిన రీపర్‌బాన్ స్ట్రాసే (వీధి) అక్కడికి దగ్గర్లోనే ఉంది. ఇదివరలో గ్యోతే ఇన్‌స్టిట్యూట్ వారు నామమాత్రంగా పగలు మాకది చూపించారు. కానీ పగలంతా మామూలుగా ఉండే ఆ వీధిలో సందడి మొదలయ్యేది రాత్రి అయ్యాకనే. టూరిస్టులకు గొప్ప ఆకర్షణగా చెప్పుకునే ఆ వీధిలో తొమ్మిది దాటేకనే హడావుడి మొదలౌతుంది. మొదలైన కొద్ది క్షణాల్లోనే వీధిలో రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. ఇంతకీ ఆ వీధి ప్రత్యేకత ఏమిటంటే – విశృంఖల శృంగార విహారం.

అక్కడ ఆగకుండా కొనసాగే సెక్స్ షోలున్నాయి. ఒక మార్కు నాణెం వేసి వ్యూయర్లో కన్ను పెట్టి చూస్తే కొద్ది నిముషాలపాటు నీలి చిత్రాలు చూపించే ఆటోమేట్లు (ఆటోమేటిక్ యంత్రాలు) ఉన్నాయి. వాటిపై మాకిప్పుడు పూర్వపు కుతూహలం లేదు కాబట్టి వివరాలు తెలుసుకుని ఊరుకున్నాం. తెరమీద బొమ్మలే కాకుండా స్టేజిమీద మనుషులే స్వయంగా మన కళ్లముందు రతిక్రీడని ప్రదర్శించే లైవ్ షోలున్నాయి. ఇవి కూడా నాన్‌స్టాప్. ఈ ప్రదర్శనల టికెట్ ముప్పై మార్కులనుంచి మొదలౌతుంది.

వీధికి పక్కన చాలా సందులున్నాయి. మేము కొన్ని సందుల్లో తిరిగి చూశాం.

ఓ సందులో విశాలమైన హాల్సు. హాలు గోడలకి, మన దేవాలయాల్ని మించిపోయేలా, రెచ్చగొట్టే పచ్చి శృంగారభంగిమలతో బొమ్మలు. హాల్లో అటూఇటూ గదులు. మధ్యలో బోలెడు స్తంభాలు. ప్రతి స్తంభాన్నీ ఆనుకుని ఓ యువతి నిలబడి ప్రియవిటునికోసం అభిసారికలా ఎదురుచూస్తోంది. దగ్గరకు వెళ్లి బేరమాడుకోవాలి. బేరం కుదిరితే ఆమెతో కలిసి పక్కనున్న గదిలోకి వెళ్లిపోయి కాసేపు కులాసాగా గడిపి వచ్చెయ్యొచ్చు.

ఓ సందులో ఒక హొటలుంది. అక్కడ సర్వింగ్ చేసేది అందమైన యువతులు. వాళ్లకి వంటిమీద నడుం కిందనే ఆచ్ఛాదన. పైన ఏ ఆచ్ఛాదనా లేదు. లోపలికెళ్లాలంటే ఏమైనా తినాలి, తాగాలి. కానీ బయట యాభై ఫెనిగ్సుకి దొరికే కోకాకోలా హొటల్లోపల రెండున్నర మార్కులు.

మేము లోపలకెళ్లలేదు. బయటే నిలబడి ఆ యువతుల అనాచ్ఛాద సౌందర్యాన్ని తిలకించాం. నిజం చెప్పాలంటే ఆ క్షణంలో ఆ యువతుల్ని చూస్తే నవ్వొచ్చింది తప్ప ఉద్రేకం పుట్టలేదు. ప్రేరణ విషయంలో జంతువుకీ మనిషికీ అదేనేమో తేడా. మనిషికి ఏకాంతం కావాలి.

మరో సందులో ఆడపిల్లలు అద్దాల షో కేసుల్లో ఉన్నారు. అద్దాని కివతలనుంచే ప్రేమబేరాలు. బేరం కుదిరితే, అద్దాల తలుపు తెరుచుకుంటుంది. ప్రియవిటుడు, అభిసారిక జంటగా లోపలి గదుల్లోకి వెడతారు. షో కేసులోకి మరో యువతి వస్తుంది.

ఆ వీధిలో పుస్తకాల షాపులు కూడా ఉన్నాయి. వాటిలో బొమ్మలు, కథలు, వార్తలు, విశేషాలు అన్నీ మహిళలకి సంబంధించినవే. ఐతే ఆ వీధి సంప్రదాయంలో ఆడదంటే మనిషి కాదు. కేవలం విలాసవస్తువు. అలాంటప్పుడు అక్కడ లభించే సాహిత్యం ఎలా ఉంటుందో, ఏ స్థాయిలో ఉంటుందో చెప్పనక్కర్లేదు. మేమా పుస్తకాల జోలికి వెళ్లలేదు

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments